కథానిక :

# మళ్ళీ పెళ్ళి

శ్రీ ఆకుండి నారాయణమూర్తి

## 1

"మా జీవితంలో నీవల్లే మాకు బాధ కల్గుతుందని ఏనాడూ ఊహించలేదు. కానీ కల్గింది!—అందుకు నువ్వే బాధ్యుడివి. ఆఖరికి నీ జీవితసౌఖ్యం ఓ పెద్దసమస్యగా తయారయింది మాకు. నీసౌఖ్యం గుఱించి మీ అమ్మ ఎంత బెంగ పెట్టుకుంటున్నదో తెలుసా?—బహుశా నీకు తెలిసుండదు!—ఇంతకీ మళ్ళీ పెళ్ళిచేసుకోనేందుకు నీకెందుకు ఇష్టంలేదో సరిగ్గా మాకు అర్థంకాకుండా ఉంది. నువ్వు తెలియజేస్తున్న కారణ మేమంత సబవుగా లేదు. నీసౌఖ్యం గుఱించి మాకు విచారం లేకుండా ఉండాలనే ఉద్దేశ్యం నీకుంటే, మేం చెప్పినట్లు విని మళ్ళీ పెళ్లిచేసుకో!—ఆ 'సబ్ రిజిస్ట్రారు' గారు మళ్ళీ వచ్చేరు. "ఏమంటారు?" అనడిగేరు. వారిపిల్ల చాలా బాగుంటుంది. చదువుకుంది కొంతవరకూ! సాంప్రదాయకమయిన కుటుంబం!—ఏమంటావు?... మాకు సంతోషం కలిగేటట్టుగానే సమాధాన మిస్తావని ఆశ!—వెంటనే ఉత్తరం వ్రాయి. వీలుంటే నువ్వోమారు ఇక్కడికి రా." అని తండ్రి రాసిన ఉత్తరాన్ని శ్రీనివాసం ఓపికతో చదివి ఓ నిట్టూర్పు విడిచేడు.

—ఏమని సమాధానం వ్రాయడం?—అందులోకీ వాళ్లకి సంతోషం కలిగేలా ఎలా వ్రాయడం?—ఏమీ అర్థం కాలేదు శ్రీనివాసానికి!...

—నిజానికి శ్రీనివాసంలో వివాహవాంఛ చాలా వుంది!—ఆ వాంఛ తీరాలంటే భార్య అవసరం ఉంది. ఇక పోతే ఒక స్త్రీ సహచారిణిగా తన ఇంట్లో లేకపోడం ఓ లోటుగానే కనిపించిం దతనికి. ఆ లోటు తీరాలంటే మళ్ళీ తను పెళ్ళి చేసుకోవాలి!—కానీ మళ్ళీ తను పెళ్లిచేసుకొని ఒక రిని ఇంట్లో పెట్టుకుంటే ఆ తరువాత మానసికంగా తను ఎంత బాధ పడవలిసుంటుందో అనేదే అతని భయం!—ఆ భయమే ఆటంకమయింది. తను మళ్ళీ పెళ్ళిచేసుకోనేందుకు ఇష్టపడకపోడంలో గల కారణాన్ని తలిదండ్రులకు ఎలా వ్యక్తం చేయడమనే ఆలోచనలో పడ్డాడు.

...దాంతోపాటు, ఆ మరదలుపిల్ల ఉషకూడా చచ్చిపోయుంటే తను తల్లిదండ్రుల వాంఛను కాదనకుండా మళ్ళీ పెళ్లిచేసుకొనేవాడు!—కానీ ఆపిల్ల ఇంకా బ్రతికేఉంది. ఆ మరదలయినా పెద్దపిల్లే అయుంటే ఆటంకం లేకపోయేది. కాని అది చాలా చిన్నపిల్ల, నాలుగేళ్ళ వయస్సుంటుంది!—తను తప్పా, ఇంకే దిక్కూ మొక్కూ లేదాపిల్లకి. ఆపిల్లని పెంచి పెద్దదాన్ని చేసి వివాహం చెయ్యవలిసే బాధ్యత తనమీదే ఉంది. ఏదో అవ్యక్తమయిన వాత్సల్యం ఆ పిల్లమీదేర్పడింది తనకి. ఆపిల్లకు బాధలు కలిగితే తను సహించలేడు. ఆ వాత్సల్యంలో ఆ ప్రభావం ఉంది!—

—ఆపిల్ల తల్లి చచ్చిపోయేముందు తను ఆమెకి చేసిన వాగ్దానాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నాడు...."ఉష గుఱించి మీరేం బెంగపెట్టుకోకండి. ఆపిల్లను నే బ్రతి

కుండగా ఏలోటూ రానివ్వను. కన్నుల్లో పెట్టుకొని కాపాడతాను" అని.

—"ఏమో నాయినా!—కొందరు పిల్లలూ, ఆయన... నే... బ్రతికుండగానే చచ్చిపోయేరు. ఇక ఇది......ఇక నువ్వే దానికి దిక్కు!...చూసేవా... ఆ రెండో అల్లుడు రానేలేదు. దాన్నయినా పంపించ... లే...దు!—వాడం...తే!..." అని ఆయాసంతో అంటూ ఆనాడు బాధతో కళ్లు మూసుకుందా మాతృశ్రీ. ఆనాటి ఆ వాగ్దానాన్నీ దృశ్యాన్నీ మరచిపోలేదు శ్రీనివాసం. ఆదృశ్యం మళ్ళీ అప్పుడు అతని మానసికబింబంలో గోచరమయింది.

తన అత్తగారన్న ఆఖరి పలుకులబట్టి తన తోటల్లుడిమీద ఆమెకు మంచిభావం లేదని తేలింది. పైగా, ఏ పరిస్థితిలోనూ ఉష నక్కడకు పంపించొద్దనే భావం ఆ పలుకులలో ధ్వనించినట్టు ఊహించేడు. బాగా డబ్బుంది తోటల్లుడికి. అయినా తన రెండో మరదలయిన సుభద్ర కక్కడ సుఖం లేదని అతనికి తెలుసు. స్వేచ్ఛ లేని బ్రతుకు గడుపుతున్న దామె అని శ్రీనివాసానికి తెలుసు. ఇక అలాంటి పరిస్థితిలో అమాయకురాలయిన ఉషను అక్కడకు పంపించేస్తే సుఖంగా బ్రతికుంటుందా అని అతని అనుమానం?!—అంచేతే భార్య చచ్చిపోయేక తల్లీ, తండ్రీ, మిగతా బంధువర్గం అంతా కలసి—"ఇంకా ఆ లంపటం ఎందుకు? నువ్వు కన్నకూతురా ఏమన్నానా?—చక్కా ఆ ఉషను దాని రెండో అక్కయ్యదగ్గరకు పంపించేసి నువ్వు హాయిగా మళ్ళీ పెళ్ళిచేసుకో!" అని ఎంత చెప్తున్నా అలా చెయ్యలేదు శ్రీనివాసం. అలా పంపించేస్తే ఉష ఎన్నో బాధలకి గురయిపోతుందని అతని భయం!—

—అదీకాక, భార్య చచ్చిపోయేముందు అంది —"ఇక మా చెల్లెలుదగ్గరకీ ఉషను పంపించేస్తారు కా...బో...లు!" అని కన్నీళ్ళు కారుస్తూ.

..."అలామాత్రం చేయను" అనన్నాడు శ్రీనివాసం. కానీ ఆమాట లామె సరిగ్గా వినకుండానే చచ్చిపోయింది, ఉషనో పెద్దసమస్యగా తయారుచేసి శ్రీనివాసానికి విడిచిపెట్టి. ఆనాటి ఆదృశ్యం మళ్ళీ అప్పుడు మనస్సులో గోచరమయిం దతనికి!—కళ్లు మూసుకొని కుర్చీలో కూలబడ్డాడు ఆలోచిస్తూ!—

—తనే మళ్లీ పెళ్ళిచేసుకున్నట్టయితే ఆవచ్చేది సవతిచెల్లెలయినఉషను అభిమానంతో చూస్తుందా?—వాత్సల్యంతో చేరదీస్తుందా?—తన తోబుట్టువులాగే చూస్తుందా?—దాన్ని బాధలు పెట్టకుండా ఉంటుందా?...అది సహజత్వానికి చాలా విరుద్ధం అనే సమాధానాన్ని పొందేడు శ్రీనివాసం. ఉష సుఖంగా ఉండాలీ అంటే తను మళ్ళీ పెళ్ళిచేసుకోకుండా ఉండడమే మంచిదనే అభిప్రాయాన్ని ఏర్పరచుకున్నాడు.

—ఉషమీద తనకు వాత్సల్యం లేకపోయున్నట్లయితే వాగ్దానాన్ని అవతలకునెట్టి ఉషను దాని రెండో అక్కయ్యదగ్గరకు పంపించేసుండేవాడు. కానీ బలీయమయిన వాత్సల్యం తన కేర్పడిపోయింది మరదలిమీద. ఇక వాత్సల్యం ఎన్నడూ తెగడానికి అవకాశం లేదు. ఆ బంధం అలాంటి బలీయమయినది!—

తల్లీ తండ్రీ లేని ఆపిల్లకు తనొక్కడే మిగిలేను. ఆ పరిస్థితిలో తను సౌఖ్యంకోసం మళ్లీ పెళ్ళిచేసుకున్నటయితే, ఆ కాపరానికొచ్చే భార్యకీ తనకీ ఉషకుఱించి మానసికంగా పెరిగే మనోవికారాలు జీవితంలో వికృతపరిణామాలకి దారి తియ్యకుండా ఉంటాయా?...ఊహుఁ!...

—ఎందుకొచ్చిన బాధ?!—పెళ్ళి చేసుకోవడం మానేస్తేనే సౌఖ్యంగా ఉంటుం దనిపించింది శ్రీనివాసానికి.

కానీ ఒక్కొక్కప్పుడు శ్రీనివాసంలో మానసికావేశాలు బయటకు ఉబుకుతూ ఉండడంకద్దు!—కానీ ఉష ముఖం అగుపించేసరికి బలవంతాన అణగిపోయేవా ఆవేశాలు!—పెళ్ళి చేసుకోకూడదని అనుకొనేవాడు!—

—నిజానికి ఉషకి చాకిరీ చెయ్యడం కొంచెం బాధగానే ఉండేది శ్రీనివాసానికి. ఒళ్ళు కడగడం, తల దువ్వడం, బట్టలు తొడగడం ఇత్యాది పనులన్నీ ఓ ఆడదానిలా ప్రతిదినం చెయ్యడం మొదట్లో కొంచెం కష్టంగానే ఉన్నా రానురాను అలవాటయిపోయింది. కాఫీ తిండీ అంతా హోటల్లోనే!—

—ఒక్క ఆఫీసు వేళల్లో తప్పిస్తే మిగతా వేళల్లో ఎప్పుడూ ఉషను తనదగ్గరే ఉంచుకొనేవాడు. ఆఫీసుటైములోమాత్రం అక్కడి కెదురుగానే ఉన్న ఓ ఎలిమెంటరీ స్కూలు హెడ్మాష్టరుగారికి ఉషను అప్పజెప్పేవాడు. ఆ హెడ్మాష్టరు జాగ్రత్తగా చూస్తాడో చూడడో అని శ్రీనివాసానికి చిన్న భయం ఉండేది. అంచేత అప్పుడప్పుడు చెపుతూ ఉండేవాడు—"జాగ్రత్తగా చూడండేం?! మీ పిల్లే అనుకోండి. మీ ఋణం తీర్చుకుంటా నెప్పుడయినా?" అని. "ఫరవాలేద"ని ఆ హెడ్మాష్టరు హామీ!—

కానీ ఆఫీసులో పనిచేస్తూ ఉన్నంతసేపూ దృష్టంతా ఉషమీదే ఉండేది. బళ్ళో పిల్లలెవరయినా అమాయికురాలయిన తన మరదలు పిల్లని కొడతారేమో!... అదొకవేళ పొరపాటున మాట్లాడితే ఆ మేష్టర్లు కసురుతారేమో?—అక్కడ అలా కూర్చోడంవల్ల ఉష ఎంత బాధపడుతున్నదో?... ఈ రకమయిన ఆలోచనలు పనిచేస్తూ ఉన్నంతసేపూ వచ్చేవి. అంచేత ఖాళీ ఉన్నప్పుడల్లా ఆ స్కూలులోకెళ్ళి ఉషను ఎత్తుకొని అలా కాఫీ హొటలులోకో, మరెక్కడికో తీసుకెళ్లి ఏవో ఓటి కొనిస్తూ ఉండేవాడు.

—అలా అంత గారాబంతో తనదగ్గర పెరుగుతూ ఉన్న ఉషకి, తన సౌఖ్యంకోసం తను పెళ్ళిచేసుకొని దానికి బాధలు కల్గజేయడం సుతరామూ ఇష్టంలేకపోయిం దతనికి!......

...తమాషాకోమారు ఉషతో అన్నాడు—"నిన్ను బొంబాయి పంపించేస్తాను, మీ సుభద్రక్కయ్య దగ్గరికి!" అని.

"ఊహుఁ! వొద్దూ..." అని గునిసింది.

"లాభం లేదు పంపించేస్తా!" అన్నాడు.

"నే వెళ్ళనూ......" అంటూ బావురుమని ఏడుపు లంకించుకుంది.

"అబ్బే!—ఊరికే అన్నాను. ఏడవకమ్మా!-" అంటూ ఉషను గట్టిగా హృదయాని కద్దుకున్నాడు.

—అప్పణ్ణుంచీ మరెప్పుడూ అలా అనలేదు శ్రీనివాసం!

...కానీ అతని తల్లీ తండ్రీ మాత్రం చాలాసార్లు అన్నారు—"దాన్ని దాని రెండో అక్కయ్య దగ్గరకి పంపించేసి, హాయిగా మళ్ళీ పెళ్ళి చేసుకోరా బాబూ?" అని.

"నే బ్రతికుండగా దాన్ని ఎక్కడికీ పంపించడం జరగదు!—దానికి పెళ్లయి అది అత్తారింటికెళ్లిపోయేవరకూ నేను పెళ్లి చేసుకోడం కూడా జరగదు." అని శ్రీనివాసం సమాధానం.

"అయితే అంతేనన్నమాట!?" అని తల్లిదండ్రుల బరువయిన వేడినిట్టూర్పు.

"మరి నన్ను బలవంతంచేసి బాధపెట్టకండి!" అని శ్రీనివాసం ఉవాచ.

చాలామంది మిత్రులుకూడా అతనికి నచ్చచెప్పబోయేరు!—"అయినా ఏమిటీ పంథా?—అర్థంలేని పంథా!...ఇప్పుడు మళ్లీ పెళ్లిచేసుకోనే అందుకు నీ వయస్సేం మించిపోయిందా?—మహా ఉంటే ముప్పై ఏళ్లకు హెచ్చు వయస్సుండదు!—ఇకపోతే నీ మరదలు పిల్లకింకా ఓ అక్కయ్య బ్రతికే ఉందికదా!—అక్కడికి పంపించేయకూడదూ? ఒకవేళ పంపించకుండా నీ ఇంట్లోనే ఉంచుకుంటే మాత్రం ఏం కొంప మునిగిపోతుంది గనక?—ఆ కాపరాని కొచ్చేది, నీ మరదలి పీక పిసికెయ్యదు!—అయినా పదేసి మంది పిల్లల్ని కన్నాక కూడా రెండో పెళ్ళి చేసుకున్న వాళ్లెంతమంది లేరు?!—అంచేత చక్కా మళ్ళీ పెళ్ళి చేసుకో!"

"మీ అందరికీ ఓ నమస్కారం!— నేను మీకు సమాధానం సంతృప్తికరంగా ఇచ్చే పరిస్థితిలో లేను. ఇంతకీ నేను మళ్లీ పెళ్లి చేసుకోకుండా ఉన్నట్టయితే మీకేం బాధలేదనుకుంటా!" అని విసుబు, చికాకులతో శ్రీనివాసం సమాధానం.

"మధ్య మాకేం బాధలే?!—కానీ నీతల్లికీ తండ్రికీ కన్న మమకారం అంటూ ఓటి నీమీదుంటుందని ఒప్పుకుంటావా?"

"ఉండొచ్చు!...కానీ నా కిష్టంలేకపోయినా పెళ్ళిచేసి వాళ్లేం సంతోషిస్తారో నా కర్థం కాలేదు."

"అసలు తల్లిదండ్రుల సంతోషాన్ని నువ్వు అర్థం చేసుకోలేదు. "మా రెండో అబ్బాయి, కోడలూ హాయిగా ఉంటున్నార"ని చెప్పుకుంటూ ఆనందించడమే వాళ్ళకి కావలిసినది!"

"వాళ్లకి నే నొక్కడినే కొడుకుని కాదు!—నాలా మరి ఆరుగురు కొడుకులున్నారు. వాళ్లంతా వాళ్ళదగ్గరే ఉన్నారు. ఇంకా ముగ్గురికి పెళ్ళికావలిసుంది. మా నాన్న బాగాఆర్జించి ఉండడంచేత వేలకొద్దీ కట్నాలిస్తా మనుకుంటూ చాలామంది ఒస్తున్నారు. ఆ మిగిలిన వాళ్ళకు వైభవంగా పెళ్ళిచెయ్యకూడదూ?—మధ్య అక్కర్లేదో అంటున్న నాకెందుకు?— పెళ్ళిచేసుకుంటే మానసికంగా నేను పడేబాధ ఎవ్వరికీ తెలీదు!!—ఇకముందు నా వివాహం గురించి తప్పించి మిగతా విషయాలగురించి మాట్లాడమని ప్రార్థన!" అని శ్రీనివాసం తన ఉద్దేశ్యాన్ని తెలియజేసేడు మిత్రులకి. తమ కెందుకొచ్చిన బాధని పూరుకున్నారు వాళ్లు.

—అలా తన అభిప్రాయాన్ని తల్లిదండ్రులకి, తన పెళ్లివిషయమై అడిగిన మిగతావాళ్లకీ చాలాసార్లు

చెప్పేడు!—అయినా అవాళ తండ్రి మళ్ళీ తన అభిప్రాయాన్ని తెలియజేయమంటూ ఎందుకు లేఖ రాసేడో అర్థంకాలేదు. ఆ ఉత్తరానికి ఏమని సమాధానం వ్రాయడమా అని ఆ ఉత్తరంవేపు చూస్తూ ఆలోచిస్తూ ఉండగా ఉష అక్కడికి వచ్చి—"ఏమిటి చదువుతున్నావు బావా?" అనడిగింది.

"ఉత్తర మమ్మా!" అన్నాడు దగ్గరకు తీసుకుంటూ.

"ఏం ఉత్తరం బావా?' అని మరదలి ప్రశ్న.

ఏమని సమాధాన మివ్వడం?—"అది కాదు గానీ, నీకో అక్కయ్య కావాలా?" అనడిగేడు శ్రీనివాసం ఏమని సమాధాన మిస్తుందో చూద్దామని!

"అక్కయ్య మళ్లీ వస్తుం దేమిటి?!"

"ఆ అక్కయ్య మరి రాదు. మరో క్రొత్త అక్కయ్య!"

"ఊఁ! కావాలి బావా. ఎప్పుడొస్తుం దేమిటి?- రవణక్కయ్యలాంటిదేనా?

"ఊహుఁ!—అలాంటిది కాదు. క్రొత్తరకం అక్కయ్య!"

"నా కన్నీ ఇస్తుందా?—తీసుకురా బావా!- అక్కయ్యఉంటే ఎంతో బాగుంటుంది." అని గునిసింది ఉష.

—ఉష ముఖంలోకి చూసేడు శ్రీనివాసం!... కుళ్ళూ కపటంలేని ఆ లేతమనస్సు మరో అక్కయ్య కావాలంటున్నది!—కానీ ఆ వచ్చేది మాత్రం "ఈ చెల్లెలు ఈ ఇంట్లో ఉండడానికి వీల్లే"దంటుంది!—అదే వ్యత్యాసం!!...ఆ వ్యత్యాసాన్ని తనెందుకు ఏర్పరచుకోవాలనుకున్నాడు.

"చూడు ఉషా!—అల్లా బల్లమీదున్న 'లెటర్ పేడ్' ఇలా తీసుకురా?" అని చెప్పేడు.

"అంటే ఏమిటి?" అని ఉష ప్రశ్న.

"తెల్లకాయితాల పుస్తకం ఉంది కదూ అది!. ఊఁ!—సరే, నేనే తెచ్చుకుంటాలే—" అంటూ తనే వెళ్ళి తెచ్చుకున్నాడు.

"ఏమిటి చేస్తావు బావా?" అని ఉష అడిగింది.

"ఏంలేదు; ఉత్తరం రాస్తా!—నువ్వు పోయి ఓ గడిసేపు ఆడుకో. ఈ ఉత్తరం రాసేయడం అయిపోయినవెంటనే నిన్ను సినీమాకి తీసుకెళతాను." అన్నాడు.

"ఏ సినీమాకి బావా?"

"ఏదో ఓ సినీమాకి!—పోనీ ఈలోగా పెరట్లోకెళ్లి గోలెంలో నీళ్లున్నాయికదూ ముఖం కడిగేసుకొనిరా!" అన్నాడు.

"మరి సబ్బో?!"

"సబ్బుతో వొద్దు!—నీఅంతట నువ్వు కడుక్కుంటే బురుగు కళ్ళల్లోకి వెళిపోతుంది."

ఉష పెరట్లోకెళ్ళిపోయింది చిన్న అంగ లేసుకుంటూ.

—ఏమని వ్రాయడం?—మళ్లీ అదే సమస్య ఎదురయింది శ్రీనివాసానికి! తన నిశ్చయాన్ని అంత నిక్కచ్చిగా తెలియబరుస్తే వాళ్లెంతగా బాధ పడతారో!—కన్న మమకారం మరలాంటిది!—అంతెందుకు?- ఉషను తను కన్నాడా ఏమన్నానా?—కానీ వాత్సల్య ప్రభావంవల్ల దాని సౌఖ్యంకోసం అంతలా బాధపడుతున్నాడు తను!—మరి తనని కన్న తల్లిదండ్రులకు తనమీద అంతకన్నా విశిష్టమయిన వాత్సల్యం ఉండడంలో అసహజత్వం ఉందా?—లేదు!—అసలు తనంత దూరప్రదేశంలో ఉద్యోగం చెయ్యడంకూడా కొంత బాధగానే ఉంది వాళ్లకి. అసలు తనను ఉద్యోగం చెయ్యొద్దే అన్నారు. ఆ పల్లెగ్రామంలోనే ఉంటూ భూముల్ని చూడమన్నారు. కానీ ఏదో ఓ పెద్ద పట్టణంలో ఉంటూ ఉద్యోగం చెయ్యాలనే అభిలాష తనకుండడంచేత తల్లిదండ్రులకు చాలా దూరంలో కుదురుకున్నాడు!—అతనికి తెలుసు తనంత దూర ప్రదేశంలో ఉండి ఉద్యోగం చెయ్యడం తల్లిదండ్రులకు సుతరామూ ఇష్టంలేదని!—అందులోకీ భార్య చచ్చిపోయేక తనొక్కడూ మరదలుపిల్లతో సహా హోటలులో తిండితింటూ కాలక్షేపం చెయ్యడం వాళ్లకి మరీ ఇష్టంలేదని తెలుసు!- అందుకే ఉద్యోగం మానేసివచ్చేయమని చాలాసార్లు రాసేరు. నిజానికి తను ఉద్యోగంచేసి వాళ్ళని పోషించవలిసే అవసరం రవ్వంతయినా లేదు. తండ్రి చాలా డబ్బు ఆర్జించేడు. ఆ ధనాన్ని జాగ్రత్తగా చూచుకుంటే చాలు!—కానీ తను బి. ఏ. వరకూ చదివినందుకు కొన్నాళ్లపాటయినా ఏ పెద్దపట్టణంలోనయినా ఉద్యోగంచేస్తూ జీవితాన్ని గడపాలనే అభిలాష ఉండడంచేత ఉద్యోగంలో ప్రవేశించాడు.

—అందులోకీ అప్పట్లో తను ఉద్యోగం మానేసి ఆ పల్లెటూళ్లో మరదలు పిల్లతో సహా తల్లిదండ్రులదగ్గరుండడం బొత్తిగా తెలివితక్కువ పనను కున్నాడు. ఉషతోపాటు తనక్కడుండడం అంత బాధ మరొక టుండ దనుకున్నాడు!—ఇక వాళ్లెవరయినా తనదగ్గరకొచ్చి ఆ పరిస్థితిలో మకాం వేసినా బాధే!—"అవసరమయితే మీఅమ్మ నక్కడికి పంపిస్తాను. అదీ వెళతానంటున్నది!" అని తండ్రో మాటు లేఖలో వ్రాసేడు. వెంటనే జవా బిచ్చేసేడు. "అమ్మకీ వాతావరణం ఏమీ సరిపడదు. దాని ఆచారానికి ఇక్కడ బొత్తిగా సరిపడదు. అంచేత పంపించొద్దు. ఇక్కడ నేను ఖులాసాగానే కాలక్షేపం చేస్తున్నాను" అని. అతనికి తెలుసు తన తల్లి గానీవస్తే వచ్చేబాధలు!—ఆమెకి, తను, మరదలిపిల్లని పోషించడం బొత్తిగా ఇష్టంలేదు పైగా ఇక రోజూ మళ్ళీ పెళ్ళిచేసుకోమని తనకి చెపుతూ గొడవ చేస్తుందని భయం!—ఒకవేళ కొంపతీసి అక్కడినుంచి తనవాళ్లెవరేనావచ్చి మకాంవేస్తారేమో అనే భయంచేత, "ఇక్కడ నాకు తిండికి ఏ ఇబ్బందీ లేదు. హాయిగా ఉంది. ప్రస్తుతం ఏ చీకూ చింతా లేదు. నాగురించి చాకిరీకై అక్కణ్ణుం చెవరూ రావలిసే అవసరం లేదు" అని ప్రతీ ఉత్తరంలోనూ చివర రాస్తూ ఉండేవాడు.

—అవాళకూడా ఆ వాక్యాలతోనే ఉత్తరం ప్రారంభిస్తూ—"నేను మళ్లీ పెళ్లి చేసుకుంటాను. కానీ ఇప్పట్లో కాదు. చేసుకొనేముందు తెలియజేస్తాను" అనే విషయాలు చేర్చి ఉత్తరం కవరులో పెట్టి అంటించేసేడు.

—అంతట్లో ఉష వచ్చిం దక్కడికి. "చూడు బావా!—గౌను నాఅంతట నేనే తొడుక్కున్నాను. కానీ జేబులోపల కెళిపోయిందిబావా!" అంది.

ఉషవేపు చూసేడు శ్రీనివాసం. పక్కున నవ్వేడు. "తిరగేసి తొడుక్కున్నావమ్మా!—నే సరిగ్గా తొడుగుతానుండు" అంటూ ఆ గౌనువిప్పి, పెట్లోంచి మరోగౌను తీసి తొడిగేడు.

—ఆతరువాత సినీమాకు ప్రయాణమయేరు ఉషతోసహా!

## 2

"ఇక్కడే ఉండమ్మా! — ఇల్లీదుకాణందగ్గర కిల్లీలుతీసుకొని వస్తాను" అని ఉషతో చెప్పి, దాన్ని ఆ గేటుదగ్గర దింపి ఆ ప్రక్కనే నాలుగు గజాల దూరంలోఉన్న కిల్లీల దుకాణందగ్గర కెళ్లేడు శ్రీనివాసం.

అతను కిల్లీలుతీసుకొని తిరిగొచ్చేసరికి, ఉషను ఓస్త్రీ ఎత్తుకోనుండడం చూసేడు. "మాబావ!—" అని శ్రీనివాసాన్ని వ్రేలితో చూపుతూ పరిచయం చేసిం దామెకు ఉష.

"మరి మీఅక్కో?!" అనడిగిందా స్త్రీ ఉషను.

"లేదు" అనంది ఉష.

"ఏమయింది?" మళ్ళీ ఆస్త్రీ ప్రశ్న.

"కట్టెలమీద పెట్టి ఎక్కడికో తీసుకెళిపోయేరు!" అని ఉష సమాధానం.

"పాపం!"అని సానుభూతి వ్యక్తంచేసిందామె.

అంతలా సానుభూతిని తెలియజేసిన ఆస్త్రీ ఎవరా అని ధైర్యంగా ఆమెముఖంలోకి చూసేడు శ్రీనివాసం. ఆమెకూడా శ్రీనివాసంవేపోమారు చూసి ముఖం మళ్లీ ఉషకేసి త్రిప్పేసి..."నేను నీకేమవుతానో తెలుసా?" అనడిగింది.

"తెలీదు!" అంది ఉష.

"అక్కయ్య నవుతాను!" అనందామె.

"అకస్మాత్తుగా అలా బంధు వొకర్తి తటస్థపడుతుందనుకోలేదు శ్రీనివాసం!..."దయుంచిపిల్లను దించేస్తారా? హాలులోకి పోవాలి." అనన్నాడు.

పిల్లను దించడం మానేసి—"ఏ క్లాసు కెళుతున్నారేమిటి?" అనడిగిం దామె.

—అంత అపరిచితురాలు అంత చనువుగా ఎలా తనని అడిగగలిగిందో అర్థంకాలే దతనికి—"ఫస్టుక్లాసులోకి!" అని సమాధానమిచ్చేడు.

"నేనూ ఆ క్లాసుకే టిక్కట్టు కొన్నాను. ఏమిటో ఈ పిల్లని చూస్తూఉంటే చచ్చిపోయిన మా చెల్లెలు జ్ఞాపకాని కొస్తున్నది!—సరే పదండి. ఒకదగ్గరే కూర్చుందాం" అంది.

హాలులోపలికి వెళ్లేరు. మధ్య కుర్చీలో ఉష, ఇటూ అటూ ఆ ఇద్దరూ కూర్చున్నారు. ఓ జీడిపప్పు పొట్లాం కొని ఉష కిచ్చిందామె!...

...అప్పటికింకా సినీమా ప్రారంభించ లేదు. "సినీమా బాగుంటుందేమిటి?" అని శ్రీనివాసాన్ని అడిగిం దామె.

"బాగుంటుం ద"న్నాడు ముక్తసరిగా

"మీ రప్పుడే చూసేరేమిటి?" అనడిగిందామె.

"లేదు. కానీ ఇవాళ బాగుంటుంది. రేపేమో?!" అని సమాధానమిచ్చేడు.

"ఔను!—ఇవాళ తప్పకుండా బాగుంటుంది. కుదిరిందలా!—" ఆమె ఏం తీసిపోలేదు.

"ఏం లాభం?" అని గొణిగేడు.

"ఎందుకుండదు?" అని ఆమె ప్రశ్నార్థకంగా అతని వేపు చూసింది.

ఆ సంభాషణనుబట్టి ఆమె వైఖరిని కొంతవరకూ పోల్చేసేడు!—ఆమె తప్పక ఎవరో వేశ్య అయుంటుందని అనుకున్నాడు. అతనిలో ఏవేవో అవ్యక్తమయిన ఆవేశాలు తలెత్తేయి. కొంతసేపలా మౌనంగా కూర్చున్నాడు. మళ్ళీ ఆమే మాటల్లోకి దింపింది—

—"పాపం!—మీ ఆవిడ పోయి ఎన్నాళ్లయిందేమిటి?"

"ఏడాది పైచిలుకయింది."

"మళ్ళీ పెళ్ళి చేసుకోలేదూ?"

"లేదు!"

"ఏం?—"

"ఇష్టం లేక!"

"నిజమే లెండి. ఇష్టంలేకుండా పెళ్ళి చేసుకుంటే చాలా బాధ పడవలిసొస్తుంది."

"కానీ నావాళ్లు మళ్ళీ పెళ్ళి చేసుకోమని చాలా బాధ పెడుతున్నారు!"

"అందుకు మీ అభ్యంతరానికి కారణం ఉందా?"

"ఈ మరదలుపిల్లే కారణం!—నేను తప్ప ఈ పిల్లకు ఇంకే దిక్కూ మొక్కూ లేదు. అదీకాక ఓ కూతురుమీద ఉండే ప్రేమకన్నా బలీయమయిన ప్రేమ ఈ పిల్లమీద నాకుంది. ఈ పిల్లే కారణం మళ్లీ పెళ్ళి చేసుకోనేందుకు నాకిష్టం లేకపోడానికి!"

"అయితే ఈ పిల్లకు అంత సంరక్షణా మీరే నన్నమాట!—లేక చాకిరీ చేసేటందుకు మీవాళ్లెవరయినా ఇంట్లో ఉన్నారా?"

"మే మిద్దరమే ఉన్నాము. 'నా' అనేవాళ్ళు నాకు చాలామందున్నారు. రమ్మంటే 'చాకిరీ' అనే మిషమీద చాలామంది ఊడిపడతారు. కానీ ప్రస్తుతానికి ఎవ్వరి బాధా లేదు!—మేమిద్దరం హొటల్లో భోంచేస్తూ సుఖంగా ఉంటున్నాం!"

"మీ రిక్కడ ఏం పని చేస్తున్నారు?"

"ఏం పని లెద్దురూ?—అంతా కలిపి ఓ రెండు వందల రూపాయలు కూడా రావు!" అన్నాడు.

"ఔను గానీ, మీరు ఈ పిల్లని కూడా మీతో పాటు ఆఫీసుకు తీసుకెళిపోతూ ఉంటారా రోజూను?"

"అదెలా వీలవుతుంది?—అక్కడికి దగ్గరగానే ఉన్న స్కూలులో ఉంచుతూ ఉంటాను."

"పోనీ ఇకనుంచీ మా ఇంట్లో ఉంచకూడదూ?—నా కెవ్వరూ లేరు. ఓ తల్లి మాత్రం ఉంది!—అంతే!...ఈపిల్లని నా చెల్లెలులా నే భావించి జాగ్రత్తగా చూస్తాను." అందామె ఉషముఖంలోకి చూస్తూ.

—ఆమె ఎవరో అంతవరకూ తెలీనే తెలీదు తనకి. అప్పటికయినా సరిగ్గా తెలీదు. అంత అపరిచితురాలు అలా ఉషను ఆమె ఇంట్లో ఉంచమని కోరడంలో ఏదో ఆంతర్యం ఉంటుందనుకున్నాడు శ్రీనివాసం!—అతనోలా ఊహించేడు!...ఆమె ఓ ఆడదయుండీకూడా సిగ్గూబిడియం లేకుండా పరాయి మొగవాడయిన తనతో అంత చనువుగా మాట్లాడుతూ ఉండడంవల్ల ఆమె ఓ క్రొత్తరకం వేశ్య అయుంటుందని భావించేడు. తన మరదలుపిల్లను అలా ఇంటిదగ్గర అట్టిపెట్టుకొని తనను మెల్లిగా వశపరచుకోవాలని ఆమె ప్రయత్నం అయుంటుందనుకున్నాడు.

—"ఏమిటలా ఆలోచిస్తున్నార"ని అడిగిందామె.

అంతట్లో అకస్మాత్తుగా లైట్లు ఆరిపోయేయి!-తెరమీద బొమ్మ పడలేదు. హాలులోని జనంలో కలకలం ఎక్కువయింది.

"ఏమలా ఆరిపోయేయి?" అని ఆమె నడిగేడు శ్రీనివాసం.

ఆమె సమాధానం ఇవ్వకముందే—"ఫ్యూజులు కాలిపోయేయి!" అనన్నాడు ఒకడు ఓగొప్పవిషయం "రిసెర్చి" చేసినవాడిలా.

"బావా ఏమిటి కాలిపోయేయి?" అనడిగింది ఉష.

"వేడెక్కువయి తీగెలు కాలిపోయేయమ్మా!" అని చెప్పేడు శ్రీనివాసం.

"అయితే మరి దీపాలు వెలగవూ?" అనడిగింది ఉష.

"వాళ్లు బాగుచేసేక వెలుగుతాయి." అన్నాడు.

ఉష మరేం మాట్లాడలేదు. కొంతసేపయింది.

"ఏమండీ ఎందుకొచ్చిన బాధ?!—పోదామా?" అనడిగిందామె శ్రీనివాసాన్ని.

"ఇంతకీ మనం సినీమా చూడ్డానికి కదూ వచ్చేం!—అయిపోయేక పోదాం!" అన్నాడు.

"సరే మీ యిష్టం!—" అందామె. కొంతసేపూరుకొని—"మీ ఇల్లెక్కడ?" అనడిగింది.

"చాలా దూరం. ఇక్కడికి సుమారు రెండున్నర మైళ్ళ పైచిలుకుంటుంది."

"ఈరాత్రి తిరిగి అంతదూరం వెళ్లడం ఎందుకు? మాయింటికొచ్చేయగూడదూ?—ఇక్కడికి దగ్గరే మా ఇల్లు. మంచి సదుపాయంగా ఉంటుంది." అనంది.

'ఔను నిజమే!—సానింట్లో సదుపాయం లేకుండానా?' అని మనస్సులో అనుకున్నాడు. ఎందుకో అతని నరాలుప్పొంగేయి. కొంతకాలమయి అణగిఉన్న మానసికావేశం పైమెట్టు కెక్కింది!.. మనస్సులో "తప్పేం?" అని ప్రశ్నించుకున్నాడు. ఇక తను మళ్ళీ పెళ్లిచేసుకోడం అన్నది ఎలానూ జరగదు. అలాంటప్పుడు తాత్కాలికంగా పొంగే ఆవేశాన్ని ఆ రకంగా పోనిస్తే తప్పేం?! - తన ప్రయోజనం తీరిపోతుందన్నమాట!—ఇక మిగతా ప్రయోజనాలు తీరకపోయినా నష్టం లేదు తనకి. కేవలం ఆ మిగతా ప్రయోజనాల కోసమనే తను మళ్ళీ పెళ్లిచేసుకున్నట్టయితే తను ఎంతో వాత్సల్యంతో చూస్తూ ఉన్న ఉషగురించి తనకు బాధ కలగడం ఖాయమని ఏనాడో నిశ్చయించుకున్నాడు!—అంచేత తను మళ్ళీ పెళ్లిచేసుకోడమనేది జరగనే జరగదు!—

...ఇక ఆవేశాన్ని మరో రకంగా అనుభవించవచ్చు! — ఇలాగ మరోదారిలో సౌఖ్యాలను పొందడంలో దోషం లేదనిపించిందప్పట్లో అతనికి. తలవని తలంపుగా అలాంటివ్యక్తికూడా తన ప్రక్కని ఆనాడు తటస్థించడం మంచిదే అనిపించింది. ఇంతకీ తన అభిప్రాయం సరిఅయినదేనా, అనే అనుమానం కల్గిందతనికి! ఆలోచనలో పడ్డాడు—

"ఏమిటంత సుదీర్ఘంగా ఆలోచిస్తున్నారు. మా ఇంటికి రావడానికి అనుమానిస్తున్నారా?" అనడిగిందామె.

"అబ్బే!...లేదు. లోకానికి..." అని శ్రీనివాసం అంటూ ఉండగానే—

"...ఆఁ!—లోకం!... నేనెప్పుడూ లోకానికి దడియను!" అందామె.

"నిజమే కావొచ్చు. కానీ నా పరిస్థితి వేరు. ఇంతవరకూ గౌరవంగా బ్రతుకుతున్నాను."

"ఇకముందూ గౌరవంగానే బ్రతుకుదురుగాని! నేనూ గౌరవనీయ కుటుంబానికి చెందినదానినే!—ఇంతకీ ఈ పిల్లనీ మిమ్మల్నీ చూస్తావుంటే పూర్వకథలు జ్ఞప్తికొస్తున్నాయి. అందుకే మిమ్మల్ని ఈ రాత్రికి మా ఇంటికి రావలసిందని కోరుతున్నాను."

బలే 'స్టంటు' కొట్టిందనుకున్నాడు. "సరే వస్తాను." అన్నాడు.

...అంతట్లో మళ్లీ లైట్లు వెలిగేయి. అనుకోకుండా ఆమె ముఖంవేపు చూసేడు శ్రీనివాసం. చిరునవ్వుతో ఆకర్షించింది. అందంగానే అగుపించింది. ఏదో ఆకర్షణశక్తి ఆమె ముఖంలో ఉంది. బలీయమయిన ఆవేశం అతనిలో కలిగింది. మళ్లీ ఆమె ముఖంవేపు చూసేడు. నవ్విందామె మెల్లగా!...

సినీమా ప్రారంభమయింది.

శ్రీనివాసానికి దృష్టి తెరమీద లేదు!—ఏదో చిన్నభయం పట్టుకుంది. జీవితంలో అంతకుముందెప్పుడూ చెయ్యని పని చెయ్యబోతున్నాడు. ఎవరేమనుకుంటారో?!...విద్యార్థిదశలో ఆడపిల్లలని చూసేటప్పుడు అప్పుడప్పుడు వెక్కిరించేవాడు—ప్రేమగీతాలు పాడేవాడు—వాళ్లని తనవేపు ఆకర్షించుకోవాలని రకరకాల ప్రయత్నాలు చేసేవాడు—వాళ్లతో మాట్లాడాలని ఉబలాటపడేవాడు. అదంతా ఓ తమాషా అయిన దశ!—అప్పుడయినా శీలం చెడగొట్టుకోలేదు. కానీ ఆనాడిక తన శీలం చెడిపోతుంది!—ఏం చెయ్యడం మరి?!—ఆ పరిస్థితి అలాంటిది!...భార్య అంటూఉంటే తను అలాంటి పని చేసే అందుకు తలపెడతాడా?—ఆహాఁ!...

ఏదో యాంత్రికంగా తెరవేపు చూస్తూ అప్పుడప్పుడు ఆమె ముఖంలోకి చూస్తూ కూర్చున్నాడు. సినీమా ప్రారంభం అయిన ఓ ఐదు నిముషాల్లోనే ఉష శ్రీనివాసం వొళ్లో నిద్రపోయింది హాయిగా.

కొంతసేపయేక అందామె—"మీ కెందుకాశ్రమ?!— నేనే వొళ్లో పడుకోపెట్టుకుంటా నా పిల్లను." అని.

"ఆఁ!—ఫరవాలేదులెండి!" అన్నాడు శ్రీనివాసం.

"కానీ ఓ ఆడదాని వొళ్లో నిద్రపోయే అంత సుఖంగా పురుషుని వొళ్ళో నిద్రపోలేరు పిల్లలు?"

"వాత్సల్యం అంటూ ఓటున్నప్పటిమాట లెండది!" అనన్నాడు.

—తమ సంభాషణ ప్రక్కనున్న వాళ్ళకి కొంచెం చీదరింపుగా ఉన్నట్లు గమనించేడు శ్రీనివాసం!—"మన సంభాషణ ప్రక్కనున్న వాళ్ళకి కొంచెం బాధగా ఉంటుంది." అన్నాడు.

"అది నిజమే లెండి!...కానీ సినీమాగురించి వాళ్ళూ సంభాషిస్తున్నారు. ప్రస్తుతం వాళ్ళ సంభాషణ మనకీ బాధగా నే ఉందికదూ?—ఏం చేస్తాం?—కొన్ని పరిస్థితులలో ఒకళ్లు చేసేపని ఇంకొకళ్లకి బాధగా ఉంటుంది!—అది సహజం." అందామె.

ఇకామెతో ఆట్టే మాట్లాడితే చాలా గొడవని ఊరుకున్నాడు.

'ఇంట్రవెల్' ఇచ్చేరు. ఉష నిద్రలోంచి లేచింది. మూడు కలర్సుకి ఆర్డరు చేసేడు. ఉష గురించి ప్రత్యేకించి జీడిపప్పు పొట్లం కొన్నాడు. కలర్సు త్రాగడం పూర్తయింది. ఉష జీడిపప్పు తింటూ ఆమె వొళ్ళో కూర్చొంది.

మళ్ళీ సినిమా ప్రారంభం అయింది!—

—కొంతసేపు తెర వేపుచూస్తూ మౌనంగా కూర్చున్నారు. అలా ఉండుండి సినీమాగురించి విమర్శ ప్రారంభించిందామె!—"చూసేరా?!—మన తెనుగుసినీమాలలోఉన్న గొడవే ఇది! ..నాయకుడిపాత్రను మహోత్కృష్టంగా చిత్రిస్తారు. వాడిని మహా ఉత్తముడిగా సృష్టిస్తారు!—అలాంటి నాయకులు సహజంగా ఉంటారా అని?"

"ఏమో ఉంటే ఉండొచ్చు!"

"కవి సృష్టించగలడేమోగానీ, దేవుడుమాత్రం సృష్టించలేడు!" అందామె.

—మరేం మాట్లాడలేదు శ్రీనివాసం. ఉషకి మళ్లీ నిద్ర వచ్చేసింది. ఆమె వొళ్లోనే పడుక్కుంది.

సినీమా అయిపోయింది. రిక్షా మాట్లాడిందామె. ఇద్దరూ రిక్షాలో కెక్కేరు. ఉష ఇంకా ఆమె భుజం మీద ఆనుకొని నిద్రపోతూనే ఉంది. 'మళ్లీ ఎన్నాళ్లకి స్త్రీస్పర్శ' అనుకున్నాడు. సైడు లైట్ల కాంతిలో ఆమె ముఖంలోకి నవ్వుతూ చూసేడు. చిరునవ్వు తొణికిసలాడిందామెముఖంలో!—ఆనవ్వు అతణ్ణి ఉత్తేజితుడిని చేసింది.

"మీ పేరు?" అనడిగిందామె.

"శ్రీనివాసం."

"ఇంతకీ నా పేరేమిటో తెలుసుకున్నారు కాదు మీరు!...నా పేరు రాధ!—ఏం...బాగలేదూ?"

"ఓ!—అమోఘంగా ఉంది!" అన్నాడు.

"నయం!—అఘోరించినట్టుందనలేదు!—సరే గానీ బహుశా మీరింకా భోంచేసుండరు! అల్లా హోటల్లో భోంచేసేస్తే బాగుంటుంది" అందామె.

"నిజమే!—బాగా జ్ఞాపకానికి తెచ్చేరు. సాయంత్రం సినీమాకు వచ్చేముందు మస్తుగా టిఫిన్ తిని రావడంచేత ఆకలెయ్యలేదు. పాపం పిల్లకి మధ్య రాత్రప్పుడు ఆకలేస్తుంది!—కొద్దిగా భోజనం చేసెయ్యాలి." అన్నాడు.

"అయితే మస్తుగా భోంచెయ్యరన్నమాట?!"

"ఏమంతగా ఆకలెయ్యలేదు ఇప్పటిమట్టుకి."

"అలా అయితే డబ్బులు దండగన్నమాట!—డబ్బులిచ్చుకొనికూడా కొద్దిగా తినొచ్చెయ్యడమేమిటి?—నామాట విని మా ఇంటిదగ్గరే భోంచేసేయండి. మరేం ఫరవాలేదు!"

"అలా కుదరదు."

"కుదురుతుంది. ఇంతకీ మీరు శాకాహారులా మాంసాహారులా?"

"శాకాహారులమే!"

"అయితే మరీ భేషుగ్గా కుదురుతుంది. నిరభ్యంతరంగా భోంచెయ్యొచ్చు!"

"ఔనుగానీ నేనెవడినో మీకింతవరకూ తెలీదుకదూ?"

—"అంచేత ఇంత బహుమానం దేనికనికదూ మీరడిగేది?—అదేమిటోగానీ ఈ పిల్లనీ మిమ్మల్నీ చూస్తూఉంటే నాకదోలాగుంది. లేకపోతే మిమ్మల్నీ రకంగా కోరవలసే అవసరం నాకేమిటి?—"

శ్రీనివాసం మనస్సులో అనుకున్నాడు; అసలు సిసలయిన వేశ్యేమో అని!—

అంతట్లో "ఆపు రిక్షా" అందామె. రిక్షా ఆగింది. "ఈ మేడ ఇల్లే మాది. దిగండి" అంటూ

ఉషను భుజంమీద ఉంచుకొని దిగిం దామె. శ్రీనివాసం రెండో ప్రక్కనుంచి దిగేడు.

తలుపు కొట్టిందామె. ఎవ్వరూ పలకలేదు. మళ్ళీ కొట్టింది. తలుపు తెరిచి అక్కడ నిలబడ్డాడో పన్నెండేళ్ల నల్లటిఅబ్బాయి. శ్రీనివాసాన్ని ఉషనూ చూసి, "తావ్...తె......తావ్!" అంటూ ఎవరు వీరని సంజ్ఞలుచేస్తూ అడిగేడు వాడు.

ప్రక్క గదిలో మంచంమీద పరుపు వెయ్యమని సంజ్ఞచేసిం దామె. వెళ్ళిపోయేడా మూగాడు.

స్విచ్ ఆన్ చేసింది. "చూసేరా ఆ వైపు!—అక్కడ బిందెలో నీళ్లున్నాయి. ఆ ప్రక్కనే ఉన్న అరుగుమీద సబ్బుంది. మొఖం కాళ్ళూ చేతులూ కడుక్కోండి" అం దామె.

శ్రీనివాసం ఇల్లంతా కలయజూసేడు ఓమారు. లోపల గదిలోంచి దగ్గు వినిపించింది. "ఎవరది?" అనడిగేడు.

"మా అమ్మ!—సరేగానీ మీరు కాళ్ళూ అవీ కడుక్కోండి." అని చెప్పి, ఉషను ఆ ప్రక్క గదిలోకి తీసుకెళ్ళి పరుపుమీద పడుక్కొ బెట్టింది.

టేబిలు తుడిచి ప్లేట్సు వేసింది.

—అవాళ చాలా చక్కని భోజనం దొరికింది శ్రీనివాసానికి. అన్నం లేదుగానీ కమ్మని "స్వీట్సు", కొద్దిగా "హాటూ", మంచి చిక్కని పాలూనూ!—ఆతరువాత ఉషను లేపి కొంచెం స్వీట్సు ఇచ్చింది తినమని. ఆ కొద్దిపాటి సేపులోనూ రాధంటే ఏదో మంచి అభిప్రాయం ఏర్పడింది ఉషకు!—చనువుగా మాట్లాడడానికి ఇంకా ధైర్యం రాలేదు గానీ, ఆమె తననేమీ బాధించేరకంమనిషి కాదనే ధైర్యం మాత్రం ఏర్పడిందా లేత మనస్సులో.

—ఓ గ్లాసుడు పాలిచ్చి ఉషను పడుక్కొ పెట్టేసింది గ్రామఫోను రికార్డులు వేస్తూ. ఓ రెండు మూడు రికార్డులు వినేసరికే ఉషకి బాగా నిద్ర వచ్చేసింది.

రాధవ్యవహారం శ్రీనివాసానికేం అర్థం కాలేదు!—ఆఖరికి...నిద్ర వస్తున్నాది" అన్నాడు.

"అదుగో మీ మరదలుపిల్ల ప్రక్కనే మంచం ఉందికదూ; అందిమీద పడుక్కోండి. నేను మేడమీదికి పోయి పడుక్కుంటాను." అందామె.

ఆమె వేశ్య కాదేమో అనే అనుమానం తట్టిం దతనికి!...ఏమయినా బాగా తెలుసుకోవాలని..."ఇక్కడ గాలి తగలదేమో!—మేమూ మేడమీదే అయితే బాగుంటుంది!" అన్నాడు.

"మీ ఇష్టం!—అక్కడి మంచంమీద పడుక్కోండి మీరు. మీకు సాయంగా మూగాడుంటాడు. నేనూ మీ మరదలూ ఇక్కడ పడుక్కుంటాము!" అనంది.

ఏదో భయం, నిస్పృహలతో మేడమీది కెక్కేడు శ్రీనివాసం.

—అక్కడ మూగాడున్నాడు. శ్రీనివాసానికి ప్రక్క చూపించేడు వాడు. ప్రక్కమీద నడుం వాల్చేడు. "మంచినీళ్లు కావాలా?" అనే భావంలో సంజ్ఞచేసేడు.

— అక్కర్లేదనే భావంతో తలూచేడు అడ్డంగా. మూగాడు ఆ ముందు వరండాలో పడుక్కున్నాడు.

శ్రీనివాసానికి మరి ఆ రాత్రి నిద్దరపట్టలేదు. ఇంతకీ ఆమె వేశ్యేనా అని అతని ఆలోచన. వేశ్య అయితే ఉద్దేశాన్ని తేల్చివెయ్యదూ? ఏమో!—మూగాడి చేతికి డబ్బిచ్చి క్రిందికి పంపించే వరకూ కదలిరాదేమో!—కానీ భయంవేసిం దతనికి. స్త్రీ హృదయం చాలా లోతయినదని అతనికి తెలుసు!—అదీకాక అంతవరకూ అతని జీవితంలో అలాంటి సంఘటన ఏర్పడలేదు ఏదో అవ్యక్తమయిన బాధ పట్టుకుం దతనికి.

—తనో రకంగా ఊహించేడు. కానీ అలా జరగలేదు. అందుకే అతని కంత బాధ పట్టుకుంది!—ఆ బాధతోపాటు ఆమెమీద కోపమూ జుగుప్సా జనించేయి!—తననుకున్నట్టే జరుగుతే చాలా బాగుండిపోయేది!—ఎంత వేగిరం ఆ ఇంట్లోంచి పోతే అంత బాగుంటుందని అనుకున్నాడు.

ఏదో బాధతోనే గడిపే డారాత్రి!—ప్రతీ దినం కన్నా వేగిరమే లేచిపోయి కాలకృత్యాలు తీర్చుకున్నాడు.

—అప్పటికి పూర్తిగా తెల్లారింది. ఉష నెత్తుకొని రాధ మేడమీదికొచ్చి—"అదుగో మీ బావ!—ఎటో వెళిపోయే రనుకున్నావు కదూ?" అని మంచంమీద కూర్చున్న శ్రీనివాసాన్ని ఉషకు చూపెట్టి, "ఎంతసేపయి లేచేరేమిటి?" అని శ్రీనివాసాన్ని అడిగిం దామె.

"చాలా సేపయింది. స్థలం మారడంచేత నిద్దర

పట్టలేదు. అప్పుడే కాలకృత్యాలు కూడా తీర్చుకున్నాను. ఇక పోవాలింటికి!" అన్నాడు.

"వెళ్ళొచ్చు! ఏం?—ఇంటిదగ్గ రెవరయినా మీకోసం కని పెట్టుకొనుంటారనా?"

"ఊహుఁ!"

"అయితే మరేం?!—ఇక్కడే భోంచేసి ఆఫీసు కెళుదురుగాని!"

"అలా వీల్లేదు."

"మా చక్కా వీలవుతుంది!—ఏం ఉషా, నువ్వంటావు కదూ?" అనడిగింది ఉషను.

"మరి బావో?!—ఏం బావా!—ఉందాం బావా?!..." అని గునిసింది ఉష.

అక్కడ ఉండడంవల్ల ప్రయోజనం లేదనిపించింది శ్రీనివాసానికి. అయినా ఉషకు అక్కడుండడం సరదాగా ఉండడంచేత—"సరే!" అన్నాడు.

"అయితే ఇక్కడే ఉండండి. నేనూ ఉషా పెరట్లోకెళ్లొస్తాము." అని చెప్పి ఉషతోపాటు పెరట్లో కెళిపోయింది.

పెరట్లో కెళ్ళేసరికి ఉషకి చాలా సరదా అనిపించింది!—గులాబీ, మల్లె, సంపంగి, సన్నజాజి, మందారం, చామంతి, బంతి, రకరకాల పువ్వులు!!

—"బాగుందా ఇల్లు?" అనడిగింది రాధ.

"ఊఁ! చాలా బాగుంది." అంది ఉష.

"అయితే మా ఇంట్లో ఉండిపోతావా?"

"మరి బావో?!—"

"బావ ఉండిపోతే ఉండిపోతావా?"

"ఊఁ!" అంది ఉష.

ఉషకి తనే స్వయంగా ముఖం కడిగి కొన్ని పువ్వుల్ని కోసిఇచ్చింది రాధ.

—'బాత్‌రూమ్'లో వేడినీళ్ళను పెట్టమని మూగాడితో చెప్పి, ఉషతోపాటు తల్లి గదిలోకి వెళ్ళింది.

"ఎవరమ్మా మనింటి కొచ్చినది?" అనడిగిందా ముసిలిది.

"ఎవరో నాకూ సరిగ్గా తెలీదు. కానీ ఈ పిల్ల అచ్చు ఆ చచ్చిపోయిన చెల్లెలు లానే ఉందమ్మా" అంది.

"అలాగా!—ఏదమ్మా, రా తల్లీ...దగ్గరికి..." అంటూ మంచంమీద కూర్చొని ముందుకి చేతులు చాచింది. ఉష దగ్గర కెళ్లింది.

ఆ పిల్లవొళ్లు నిమురుతూ—"నీ పేరేమిటమ్మా?" అనడిగింది.

"ఉష!" అనంది కీచుగొంతుకతో.

"ఉషా?!...రాధా.. అచ్చు మన 'ప్రభ' గొంతుకే నే!...ఇంతకీ కళ్లుపోయేయి నాకు...ఉంటే ఎంత బాగుండును!—అన్నట్లు ఆ మాట్లాడుతున్న మొగాళ్లెవరమ్మా?—" అనడిగింది.

"అతను ఈ పిల్లకి బావగారు. ఈ పిల్ల అక్కయ్య చచ్చిపోయింది. అతనూ ఈ పిల్లా ఉంటున్నారు. అతనికి ఈపిల్ల అంటే ఎడతెగని ప్రేమ!—నిన్న సినీమాహాలుదగ్గర కలుసుకున్నాను." అంది రాధ.

అంతట్లో అక్కడికి మూగా డొచ్చేడు. పొయ్యరాజెయ్యమంది.

—కాఫీ త్రాగడం, భోంచెయ్యడం పూర్తయింది. "ఇక పోవాలి. ఆఫీసుకు 'టైం' అయింది." అన్నాడు.

"కానీ ఉషను మాత్రం ఇక్కడె వదిలెయ్యండి. సాయంత్రం ఆఫీసునుంచొచ్చి తీసుకెళుదురు గాని!"

"అలా కుదరదు!—రా ఉషా!" అన్నాడు. ఉష బావదగ్గర కెళ్లింది.

"పోనీ సాయంత్రం వేళల్లో వస్తూఉండండి రోజూను." అనంది.

"అలాగే!" అనన్నాడు శ్రీనివాసం.

ఓ మంచిబొమ్మ, ఓ చిన్న మరమోటరుకారు ఉష కిచ్చింది. వెళిపోతున్నప్పుడు—"ఏం ఉషా!—సాయంత్రం మీ బావగారిని తీసుకురా!" అనంది రాధ.

"అలాగే!" అనంది ఉష.

రిక్షా కుదుర్చుకొని అందులో కూర్చొని వెళిపోయే రిద్దరూ!

## 3

ఆఫీసు పనయినవెంటనే స్కూలు దగ్గర కొచ్చి ఉషను కలుసుకున్నాడు శ్రీనివాసం.

"బావా!—మళ్ళీ ఆ అక్కయ్య ఇంటికెళదామా; రమ్మంది కదూ మన్ని?!" అనంది.

"ఇవాళ మరో క్రొత్త అక్కయ్య ఇంటికెళదాం!" అన్నాడు.

"మంచిదేనా ఆ అక్కయ్య?" అనడిగింది.

"ఊఁ!" అన్నాడు.

తరవాత అలా కాఫీహోటలుకెళ్ళేరు. టిఫిన్ తిన్నారిద్దరూ. అనంతరం అలా పార్కుకెళ్ళి కొంతసేపుండి ఇంటికొచ్చేసేరు. ఉషకి వొళ్లు కడిగి బాగా ముస్తాబుచేసేడు. తనూ స్నానంచేసి, మంచిదుస్తులు వేసుకొని టాయిలెట్ అయేడు.

వీథిలోకి బయలుదేరుతూ ఉన్నప్పుడు—"క్రొత్త అక్కయ్య ఇంటికా బావా?" అనడిగింది ఉష.

"ఊఁ—భోంచేసి వెళదాం." అన్నాడు.

హోటలులో భోజనం ముగిసినతరువాత, తిన్నగా సానివీథిలోకి బయలుదేరేడు. గుమ్మంలో కూర్చొని నవ్వుతూ తనవేపుచూస్తూఉన్న ఒకామెను చూసేడు. అంతా క్రొత్త!—మొదట కొంచెం భయపడ్డాడు. అఖరికి ధైర్యం తెచ్చుకొని—"రావొచ్చా ఇంట్లోకి?" అనడిగేడామెను.

"మీకోసమే ఎదురుచూస్తున్నాను!" అందామె అంతసేపయి శ్రీనివాసంకోసమే కాచుకొని కూర్చున్నట్లు!—

లోనకెళ్లేడు. అంతా కుదిరిపోయింది!—ఉష నిద్రపోయింది!—ఆ రాత్రి గడిచిపోయింది!!—అది మొదలు శ్రీనివాసం జీవితంలో గొప్పమార్పువచ్చింది. ఆవీథంతా బాగా పరిచయమయిపోయిందతనికి!—

క్రొత్తక్రొత్త అక్కయ్యలపరిచయమేర్పడింది ఉషకి. కానీ ఆ తొలినాటి రాధఅక్కయ్యంత మంచిగా ఎవరూ కనిపించలేదామెకు. అందుకే రోజూ అనేది, "అల్లా అక్కయ్యదగ్గరకు వెళదాం" అని.

"అలా ఉందికానీ, అది మంచిది కాదమ్మా!" అని చెప్పేవాడు. కానీ బావమాటల్ని ఉష నమ్మలేక పోయేది.

—భార్య అంటూ లేకపోయినా, తనకోరిక నెరవేర్చుకుంటున్నందుకు తృప్తి కొంతవరకూ ఏర్పడింది శ్రీనివాసానికి!—ఒక్కొక్కప్పుడు తను చేస్తూ ఉన్న పని చాలా నీచమయినదని అనిపించినా; తనపరిస్థితలా ఏర్పడింది; ఏంచెయ్యడం?...అని అనుకొని సమాధానపడేవాడు.

అతని మిత్రులు పసికట్టేరు శ్రీనివాసం వ్యవహారాన్ని!—"ఇలా తయారవుతావనుకోలేదు!" అన్నారు.

"నేనూ అనుకోలేదు. కానీ ఏం చెయ్యమంటారు?—పెళ్లిచేసుకుంటే, ఈపిల్లకెంత బాధేర్పడుతుందో తెలుసా?!—ఇలా అయితే ఈపిల్లమీదెవ్వరికీ ఈర్ష్యా జుగుప్సలుండవు!"

"బాగుంది!...జ్ఞానం ఉన్నవాడివి నువ్వు!—నీకు మేంచెప్పేదేముంది?—ఈ సంగతి మీవాళ్లకి తెలుస్తే వాళ్లెంత బాధపడతారో తెలుసా?!"

"నా ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకుంటే వాళ్లు బాధపడరు."

"ఆఁ!—పోన్లెద్దూ?—ఏం ఉద్దేశ్యం"!—అఖరికి జీవితంలో ఎందుకూ పనికిరాని వ్యక్తిగా తయారవుతావు. లోకులు నిన్ను చాలా నీచంగా చూస్తారు"

"నిజమే!—లోకుల దృష్టిలో నే చేస్తూఉన్న పని చాలానీచంగానే కనిపిస్తుంది. కానీ నామట్టుకి నాకు అంత నీచంగా కనిపించలేదు. మంచి శీలం కలవాడినని లోకులచేత అనిపించుకోవాలని నాకు లేదు. నా సుఖంకోసం నేనీ పని చేస్తున్నాను!—నాసంజాయిషీ మీకు సమంజసంగా తోచకపోవొచ్చు. అయినా నాకు నష్టం లేదు!"

ఇక అతనికి హితోపదేశంచెయ్యడంవల్ల లాభం శూన్యమని గుర్తించేరతని మిత్రులు. అతనితో మాట్లాడడం కూడా తగ్గించేసేరు. శ్రీనివాసం విషయం ఎప్పుడయినా వొస్తే—"వాడొట్టి వెధవ!" అని అనుకొనేవారు.

—రోజురోజుకీ నీరసించిపోడం మొదలెట్టేడు శ్రీనివాసం!—భయం బెంగా పట్టుకున్నాయి!—దానికితోడు ఇంటి దగ్గరనుంచి వచ్చే లేఖలు మరీ బాధను కల్గించేవి!—"ఇంకా ఎన్నాళ్లిలా పెళ్లిచేసుకోకుండా ఉంటావు?—ఆ పిల్లకోసం నీ జీవితాన్ని నాశనం చేసుకోకు. దాన్ని దాని రెండో అక్కయ్య దగ్గరకు పంపించేయి. అ దెలాపోతే నీకేం బాధ?—నువ్వు సుఖంగా ఉండు!—" ఆ ధోరణిలో ఉండేవి లేఖలు.

—ఏ సుఖాలనయినా తను త్యజించగలడు గానీ ఉషను త్యజించడం తనకెలా సాధ్యమవుతుంది?—ఉషనే విడిచిపెట్టేస్తే మానసికంగా తన

జీవితంలో సుఖపడగలడా?—ఒట్టి మాట!—ఇక తన జీవితం ఆరకంగా గడవవలిసిందే!—ఇంట్లో సహధర్మచారిణిగా ఓ స్త్రీ తన కుండదు. అంతే!—ఇకపోతే మిగతా సౌఖ్యాలను తను అనుభవించ గలడు!—అందుకు కావలసిన డబ్బుంది తనదగ్గరని అనుకున్నాడు.

## 4

శ్రీనివాసం పూర్తిగా పాడయిపోయేడు. రాత్రిళ్ళు ఉషతోపాటు సానివాళ్ళ ఇళ్ళల్లోనే మకాం!—

ఓనాటి రాత్రి శ్రీనివాసం సానివీధిలోకి ఉషతోపాటు వెళ్తున్నప్పుడు రాధ ఎదురయి ఆపు చేసింది.

—"ఈమధ్య ఒక్కమారూ మా యింటికి రాలేదేం?—వస్తారని ఎదురుచూసే నిన్నటూ!—అయినా ఈ వీథిలో కొచ్చే శేమిటి?" అనడిగింది రాధ.

శ్రీనివాసం ఇంకా సమాధానం చెప్పకముందే-"నువ్వు మంచిదానివి కావుట!—అందుకు రోజుకో క్రొత్త అక్కయ్య ఇంటికి తీసుకెళుతున్నాడు మా బావ!" అని ఉష సమాధాన మిచ్చింది.

"ఓ!—అలాగా?—నిజమేనాండి?—" అని శ్రీనివాసాన్ని అడిగిందామె.

"మీ కనవసరం!—" అని శ్రీనివాసం సమాధానం.

"పోనీ ప్రస్తుతం ఎవరింటి కెళుతున్నారు?"

"ఆ విషయం మీ కనవసరమే?"

"పోనీ ఎందు కెళుతున్నారో చెప్పండి?"

"చెప్పినందువల్ల ప్రయోజనం ఉంటుందా?"

"ఉంటుంది!"

"అయితే చెప్తా!" అని జరుగుతూన్న విషయం చెప్పేడు. నమ్మలేకపోతున్నాను!" అనందామె ఆశ్చర్యంతో.

"నమ్మలేకపోవొచ్చు!—కానీ నా పరిస్థితి ఇలా నన్ను తయారుచేసింది. ఇక పోతా!" అని ముందుకి అడుగు వెయ్యబోయేడు శ్రీనివాసం.

"వీల్లేదు. ఇవాళ మీ మార్గానికి నే నడ్డొస్తున్నాను!" అనంది రాధ ఎదురుగా నిలబడి.

"అడ్డొస్తే పడిపోతారు. నన్ను అనవసరంగా ఆపకండి."

"మీరెందు కెళుతున్నారో గ్రహించి నేను పిలిచినట్టయితే వస్తారా మా ఇంటికి!"

"వస్తా!"

"అయితే పదండి!" అంది. రిక్షా మాట్లాడింది. ఎక్కేరు.

"ఏమిటో మీ వ్యవహారం నాకు వింతగా కనిపిస్తున్నది!" అన్నాడు శ్రీనివాసం.

"మీకే కాదు; నన్నర్థం చేసుకోలేని చాలా మందికి అలానే అగుపిస్తుంది నా వ్యవహారం!" అందామె.

"అర్థం చేసుకోడాని కేముందిలెండి!—కొంచెం అభ్యుదయ పంథాలో ఉంది మీ ధోరణి."

"ఎలా అయితే నేం గ్రహించేరన్నమాట!—ఆఖరికి నన్నో వేశ్య క్రింద జమకట్టేసేరు!—ఇంకా మన్నించడం ఎందుకూ?—ఏకవచన ప్రయోగమే చెయ్యండి!"

"అదీ నిజమే!—ఇకనుంచీ మన్నించను. కానీ అదేమిటో గానీ నీమాటలు వింటూ ఉంటే నా భార్య జ్ఞాపకాని కొస్తున్నది!"

"అలాగా!" అని నవ్వింది రాధ.

రిక్షా పోతున్నది ముందుకు.

"ఏమాత్రంలో ఉంది వ్యవహారం?" అనడిగేడు శ్రీనివాసం.

"తమ దయ!" అని నవ్వుతూ అంది రాధ.

"అయితే మరీ మంచిది!" అన్నాడు శ్రీనివాసం.

నవ్వాగింది కాదామెకు!— ఉషముఖం లోకి చూసింది. "ఇలా ఎండిపోతున్నదేం?" అనడిగింది.

"నిజమేనా?" అని అడుగుతూ ఉషవేపు ఆందోళనతో చూసేడు.

"మీరుకూడా చాలా నీరసించిపోయేరేం?" అనడిగింది.

"నిజమే నంటావా?"

"అబద్ధం చెప్పలేదు. నామాట విని ఆఫీసుకు సెలవుపెట్టి ఓ నెలరోజులపాటు మాఇంట్లో ఉండండి. మళ్లీ ఆరోగ్యం చేకూరుతుంది."

"గొప్ప సలహా!—ఆలోచిస్తాలే!" అన్నాడు.

"మీరు స్వయంగా ఆలోచించలేరనుకుంటా!"

"ఆలోచనలు కూడా ఎరువుతీసుకోవలసే గతి పట్టలేదింకా!"

—"అని మీరనుకోవచ్చు!—కానీ బండీ దారి తప్పింది!"

"లేదు! — నామట్టుకి సవ్యమయిన దారి లోనే ఉన్నట్లగుపిస్తున్నది." అనన్నాడు శ్రీనివాసం.

రిక్షా మలుపు తిరిగింది. "ఆపుఆ మేడదగ్గర!" అందామె.

ఆపేడు రిక్షా. "డబ్బులు నేనిచ్చేస్తా నన్నా"డు శ్రీనివాసం.

"ఆఁ!—అవసరం లేదు. నేనే ఇచ్చేస్తా" నంటూ డబ్బులు తీసి ఇచ్చేసింది.

ఆమె డబ్బులు తీసిఇచ్చేస్తూ ఉంటే—"ఏమ యినా ఇదంతా అభ్యుదయపంథా!—ఒక్కమారు గుంజుకో డానికీ పంథా!" అని గొణిగేడు.

"జౌను!" అనందామె నవ్వుతూ.

ఉష నెత్తుకోని ఇంట్లోకి ప్రవేశించిందామె! —మేడమీద టేబిలు తుడిచి పళ్లేలు వేసి—"అన్నం ఇక్కడికే పట్టుకొస్తాను." అనంది.

"మే మప్పుడే భోంచేసేశాము." అన్నాడు.

"ఏం ఉషా!—అన్నంతిన్నావా నువ్వు!—" అ నడిగింది.

"తిన్నాను!" అంది ఉష.

అప్పటికి నమ్మకం కలిగిందామెకు. "అయితే కొంచెం 'స్వీట్సు' తెస్తానుండండి." అని చెప్పి ఉష నెత్తుకొని క్రిందికి దిగింది.

బీరువా తెరిచి అందులో ఉన్న 'స్వీట్సు' బయటకు తీస్తూ—"ఉషా! — రోజూ మీ బావ ఎక్కడి కెళుతున్నారమ్మా!" అ నడిగింది.

"అక్కయ్యల ఇంటికి!"

"వాళ్లు నాతో మాట్లాడేవాళ్లేకాదు. ఏమీ ఇచ్చేవాళ్లే కాదు!"

"వాళ్ళు మంచివాళ్లు కాదమ్మా!—అలాంటి వాళ్ళింటి కెప్పుడూ వెళ్లకూడదు. మీ బావతో ఎప్పుడూ వెళ్లకు."

"మరి బావ వెళితే ఎలాగ?"

"ఇక్కడే ఉండిపోతానను!—మీ బావ ఆఫీ సుకు వేళ్లే వేళల్లో ఇక్కడే ఉండిపో!—నేను నీకు చక్కా చదువు చెపుతాను." అనంది.

"అలాగే!" అనంది ఉష.

"స్వీట్సు" గిన్నె ఓచేత్తో పట్టుకొని, ఓచేత్తో మెల్లగా ఉషను పట్టుకొని ఎక్కిస్తూ మేడమీది కెళ్లింది రాధ.

ప్లేట్సు సర్దింది. కిటికీలోంచి వీధిలోకి చూస్తూ ఉన్న శ్రీనివాసాన్ని టేబిలుదగ్గరకు రమ్మని పిలిచింది. టేబిలు దగ్గరున్న ఓ కుర్చీలో కూలబడ్డాడు. "ఏం ఆకలి లేదు!—ఇప్పు డెందు కివన్నీను!" అనన్నాడు.

"కొంచెం తీసుకోండి!" అనంది రాధ.

ఎందుకో నవ్వేడు శ్రీనివాసం!—

"పాటలు వెయ్యవూ?" అని రాధ నడిగింది ఉష.

"ఏముందోయ్!—ఈ ఉషకి పాటలంటే బలే సరదాలాగుంది. సంగీతం చెప్పించాలి. ఏమంటారు?" అనంటూ రేడియో 'స్విచ్ ఆన్' చేసింది. 'సిలోన్' స్టేషను పెట్టింది. ఉష రేడియో వేపు ఆసక్తితో చూస్తూ ఆ ముందునే ఉన్న ఓ కుర్చీలో కూర్చుంది ఓ లడ్డూ తింటూ.

—రాధ శ్రీనివాసానికి ఎదురుగుండా ఉన్న కుర్చీమీద కూర్చొని ప్లేటు ముందుకు లాగుతూ అంది— "ఉష భవిష్యత్తుగురించి ఆలోచించేరా?"అని.

"ఆలోచించబట్టే పెళ్ళి చేసుకోకుండా ఇలా కాలక్షేపం చేస్తున్నాను." అని సమాధానమిచ్చేడు.

"మీకు దూరాలోచన లేదన్న సంగతి తేలి పోయింది!"

"ఏం!"

"చెప్పాలంటారా?"

"చెప్పాలి."

"మీరు రేపు చచ్చిపోతారనుకోండి!"

"ఆఁ!—చచ్చిపోతే!..."

"అప్పుడీ ఉషకు ఎవరు దిక్కు?"

"ఆవిషయంగురించి నేనెప్పుడూ ఆలోచించ లేదు!—ఇంతకీ నేను చచ్చిపోను. ఈ ఉషకోసం బ్రతికుంటాను. దీనికి పెళ్లయి అత్తారింటి కెళిపోయే అంతవరకూ ఉంటాను!"

"చావు అనేది మీ ఆధీనంలో ఉండదు!"

"ఇంతకీ ఈ వేదాంతంఅంతా నాకెందుకు?—నేనెందు కిక్కడికి వచ్చేనో తెలుసా?"

"తెలుసు!—కానీ నేను సానిదాననిమాత్రం కాదు."

"అయితే మరెందుకు నన్నిక్కడికి తీసుకొచ్చేవు?"

"చెడిపోతున్న మిమ్మల్ని బాగుచేద్దామని!"

"నా బాగోగులు నాకు తెలుసు!"

—"అని అనుకుంటున్నారు మీరు!—నామాట మన్నించి మీరు సానికొంపలకు వెళ్లడం మానేయండి. మీ బాగుకోసమే చెప్తున్నాను."

"నే వెళ్లినా నీకేం నష్టం లేదనుకుంటా!"

—"నష్టం ఉంది!" అందామె.

ఆమె ఎందుకంతలా తన బాగుకోసం ప్రాధేయపడుతున్నదా అని అనుమానంవేసింది శ్రీనివాసానికి—"నీతత్వం, నాకేం అర్థంకావడంలేదు!"అన్నాడు.

"ముమ్ముందు అర్థమవుతుంది లెండి!—అయినా మీరిప్పుడెలాగ ఉన్నారో తెలుసా!—ఏదో జబ్బుపడిన వ్యక్తిలాగున్నారు!" అందామె.

నిజమే అనిపించింది శ్రీనివాసానికి!—అంతకి తొలిరోజు నే గుండెల్లో విపరీతంగా నొప్పి వచ్చింది. నిజానికి శారీరకంగా కొంతబాధ ఉంది. కొంపతీసి, తను అకస్మాత్తుగా గుండెనొప్పివల్ల చచ్చిపోతానేమో అనే భయం అప్పుడు కలిగిందతనికి!—తను చచ్చిపోతే ఉష ఏమయిపోతుంది?—ఇంతకీ తను ఎవరికోసం పెళ్లిచేసుకోడం మానేసి అలా తయారయేడు?—ఉషకోసమేకదా?!—మరలాంటప్పుడు తను తన శరీరారోగ్యాన్ని లెక్క చెయ్యకుండా తిరగడం సమంజసమయిన పనేనా?—ఆలోచించడం మొదలెట్టేడు.

"ఏమిటలా ఆలోచిస్తున్నారు?" అనడిగింది రాధ.

"ఏం లేదూ!—గుండెల్లో కొంచెం భారంగా ఉంది!" అన్నాడు ప్లేటులో చెయ్యి కడుక్కుంటూ.

"చూసేరా మరి?!—నాకు తెలుసు. నామాట విని ఈ తిరుగుళ్లు మానండి. మానలేకపోతే నన్ను పెళ్ళి చేసుకోండి!" అనంది రాధ.

ఆశ్చర్యపోయేడు శ్రీనివాసం!—

"నిన్నా?!" అనడిగేడు శ్రీనివాసం ఆశ్చర్యంతో.

"ఏం?—తగనా?!—వితంతువునని అనుమానిస్తున్నారా?" అనడిగింది.

మరింత ఆశ్చర్యపోయేడు శ్రీనివాసం!...... "నువ్వు వితంతువివా?"

"అవును!—ఇప్పటికప్పుడే నాలుగేళ్లయింది నా భర్త పోయి!—ఆయన మిగిల్చినదే ఈ ఆస్తంతాను. ఆయనవాళ్లెవరూ సజీవంగా లేకపోడంచేత నా ఈ స్వేచ్ఛకు ఆటంకం లేకుండా ఉంది!—ఆయన చచ్చిపోయేక, మళ్ళీ పెళ్ళి చేసుకుందామనే ఉద్దేశ్యం నా కిప్పటివరకూ లేదు!—కానీ మిమ్మల్నీ మీ మరదల్నీ చూసిన తరవాత నాకీ అభిప్రాయం ఏర్పడింది!—ఇంతకీ ఏమంటారు?"

"బాగు బాగు!—వితంతువుని పెళ్లాడితే లోకులేమంటారు?" అన్నాడు.

"సానివాళ్లింటికెళితే ఏమీ అనరా?"

"అదేమంత తప్పని కాదు!—కానీ వితంతువుని పెళ్లాడితే సంఘంలోంచి వెలివేస్తారు లోకులు!—మా అమ్మా నాన్నా మరిక తలెత్తుకోలేరు సంఘంలో!—పెళ్లి నే చేసుకోకుండా ఉండడం వల్ల కొంత బాధపడుతున్నారు. ఇక తీరా ఓ వితంతువుని పెళ్ళి చేసుకుంటే వాళ్ళ బాధ మరో క్రొత్త రకం బాధగా మారుతుంది!"

"సరే గానీ, మీరు సానికొంపలకు వెళుతున్నట్లు మీవాళ్లకి తెలిస్తే సంతోషిస్తారా?"

"సంతోషించరు!—చాలా బాధపడతారు!"

"నన్ను పెళ్ళి చేసుకుంటే ఉండే బాధకన్నా తక్కువా ఆ బాధ?"

"ఆలోచించవలసినవిషయమే అది! - అయినా నిన్ను పెళ్ళి చేసుకోడంమాత్రం జరగదు!"

"సరే గానీ, మీరు మాత్రం కొన్నిరోజులపాటు నా యింట్లో ఉండాలి!"

"అనవసరం!"

"మీశరీరపరిస్థితి మీకు తెలియకుండా ఉంది!—ఈవిధంగా ఉంటే ఎప్పుడో ఒకప్పుడు మీరెలాంటి బాధలకు గురవుతారో ఆలోచించేరా ఎప్పుడయినా?—నా మాట విని నన్ను పెళ్లాడి సుఖపడండి. మీకేలోటూ రానివ్వను. ఉషను నా స్వంత చెల్లెలు

లానే చూస్తాను. అసలు ఇప్పుడు నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటా ననడానికి ముఖ్య కారణం ఉష; రెండో కారణం మీరు!—ఏదో అనూహ్యమయిన శక్తి మిమ్మల్ని చూసినదగ్గరనుంచీ మీమీద ప్రేమ కలుగజేసింది; ఉషమీద వాత్సల్యాన్ని కలుగజేసింది!—అంచేతే మీ ధోరణి తెలిసినా, మిమ్మల్ని పెళ్లి చేసుకుంటానని అంటున్నాను. మిమ్మల్ని నేను పెళ్లి చేసుకుంటే ఇక ముందిలా ఉండరనే అభిప్రాయం కూడా ఉంటుంది."—

—వింటూ శ్రీనివాసం కుర్చీలో చేరబడి చేత్తో తల పట్టుకొని—"అబ్బ!—తల నొప్పి దంచేస్తూంది. ఇప్పుడు మరేమీ చెప్పకు!" అన్నాడు చిరాగ్గా—

"నిజమేనా?" అని అడుగుతూ శరీరాన్ని తాకి చూసింది రాధ. కొంచెం వెచ్చగా తగిలింది శరీరం. "బహుశా వేడి చేసుంటుంది. ఆ ప్రక్కమీద ఏ విషయాలూ ఆలోచించకుండా పడుక్కోండి. నేనూ ఉషా క్రిందగదిలో పడుక్కుంటాం! మూగాడిక్కడుంటాడులెండి!" అని చెప్పి ఉష కూర్చున్న కుర్చీదగ్గర కెళ్ళింది.

—ఉష అలా కుర్చీలో కూర్చునే నిద్రపోతూ ఉండడం చూసి—"పాపం, ఎలా నిద్రపోయిందో!" అని తనలో తానే అనుకొని, ఆ పిల్లను జాగ్రత్తగా భుజంమీద పడుక్కోబెట్టుకొని, రేడియో స్విచ్ ఆఫ్ చేసి క్రిందికి దిగిపోయింది.

—ఆరాత్రి శ్రీనివాసానికి సరిగ్గా నిద్రపట్టలేదు!—రాధని పెళ్లాడితేనో?—అని అతని ఆలోచన!—చాలా మంచిదానిలాగే ఉంది. అదీకాక తను గమనిస్తూనే ఉన్నాడు ఆ కొద్దిపాటి కాలంలోనూ ఉషకి రాధదగ్గిరేర్పడిన చనువు! ఆ ఇద్దరి మధ్యా ఏదో గొప్ప వాత్సల్యం ఏర్పడింది!—అలాంటప్పుడు రాధని పెళ్ళి చేసుకుంటే తనకి బాధేం?—

—కానీ తన తల్లిదండ్రులు ఒప్పుకుంటారా?—వాళ్లొప్పుకోరసలు!—పెళ్లి చేసుకోడమయినా మానేయమంటారు గానీ ఆ వితంతువుని వివాహం చేసుకోనేందు కొప్పుకోరు. అది నియమవిరుద్ధం అంటారు!—ఎలా?—వాళ్లని కాదని తను ఆమెను పెళ్ళి చేసుకోడం సబబయిన పనేనా?—

—అదీకాక హృదయాన్ని విప్పిచెప్పి, తన శ్రేయస్సుకోసమే ఆమెను వివాహం చేసుకోమని అంటూవున్న రాధ కోరిక త్రోసిపుచ్చడం మంచి పనేనా?— అనుకోకుండా దైవవశాత్తూ తామిద్దరి మధ్యా అనుగుణంగా కొద్దికాలంలోనే ఏర్పడ్డ అనురాగబంధాన్ని త్రెంపేయడమేనా?—ఏం చెయ్యడం?—ఏమీ తోచలేదతనికి. ఎడతెగని సమస్యల గురించి తీవ్రంగా ఆలోచిస్తూ ఆరాత్రి గడిపేసేడు.

ఎంచేతోగానీ ఓ నాలుగైదు రోజులపాటక్కడ ఉండాలనిపించింది. శ్రీనివాసానికి!—

లోన కొంచెం జ్వరం ఉన్నట్టున్నా, అవాళ బాగా భోంచేసి, ఆఫీసు కెళ్లేడు. రాధదగ్గరే ఉష ఉండిపోయింది.

ఆ సాయంత్రం ఇంటికి తిరిగొచ్చేడు శ్రీనివాసం!—వస్తూనే—"జ్వరం బాగా వచ్చేసినట్టుంది రాధా!—గుండెలో నొప్పిగా కూడా ఉంది!" అన్నాడు సావిట్లో ఉన్న ఈజీఛైరులో కూలబడుతూ.

"శరీరాన్ని పూర్తిగా పాడుచేసుకున్నారు!" అని అంటూ దగ్గరకెళ్ళి చెయ్యిపట్టుకుంది. "అరె!-మరిగిపోతూంది శరీరం!—గదిలోకొచ్చి పడుక్కోండి. ప్రక్క దులుపుతా!" అనంటూ గబగబ ఆ ప్రక్క గదిలోకి వెళ్లి ప్రక్క దులిపింది. శ్రీనివాసం మెల్లగా గదిలోకొచ్చి మంచం ఎక్కేడు!—పడుకున్నాడు.

"డాక్టర్ని తీసుకొస్తా!" అంది రాధ ఆందోళనతో.

"ఊఁ!—గుండెల్లో నొప్పిగా ఉంది. తల నొప్పి భరించలేనంతగా ఉంది. చచ్చిపోతానేమిటి చె...ప్మా?" అన్నాడు ఆయాసంతో మూలుగుతూ.

ఆ మాటలు వినేసరికి దెబ్బతిన్న లేడిలా త్రుళ్లిపడింది రాధ. ఆమె హృదయంలో ఏదో కంపం బయలుదేరింది!—"భయంలేదు, పడుక్కోండి. బాగా వేడిచేయడంవల్ల వచ్చుంటుందీ జబ్బు!—నేనిప్పుడే డాక్టర్ని తీసుకొస్తాను." అంటూ రెండడుగులు వేసింది.

"ఉషేదీ?" అనడిగేడు శ్రీనివాసం.

"మేడమీద రేడియో వింటోన్నది. తీసుకొస్తా!" అనంటూ మేడమీదికి పరుగెట్టి ఉషని ఎత్తుకొని తీసుకొచ్చింది. శ్రీనివాసం ప్రక్కని కూర్చోబెడుతూ—"చూడమ్మా!—బావకి జ్వరం వచ్చింది.

ఇక్కడే కూర్చో. నే నిప్పుడే వస్తాను." అని చెప్పి డాక్టర్ని తీసుకు రావడానికని వెళ్ళిపోయింది.

"బా...వా...జ్వరం వచ్చిందా?—" అనడిగింది ఉష, బావముఖంలోకి చూస్తూ.

"ఔనమ్మా!" అనంటూ ఉషని హృదయానికి హత్తుకున్నాడు. ఎందుకోగానీ, కన్నీళ్లు కారేయతనికి!—

"ఏం బావా ఏడుస్తున్నావు?" అనడిగింది ఉష అమాయకంగా.

"ఏడవలేదమ్మా!...కళ్లు మండుతున్నాయి. అం...దు...కు!—ఔనుగానీ ఈ రాధక్కయ్య మంచిదేనా?" అనడిగేడు.

"మంచిదే బావా!—అల్లా, ఆ అక్కయ్యల లాంటిది కాదు. చాలా మంచిది!" అని ఉష సమాధానం.

మళ్ళీ కన్నీళ్ళు కాగే యతనికి. మరి మాట్లాడ లేకపోయాడు. మళ్ళీ గుండెల్లో నొప్పి వచ్చింది!...

"బావా!...మనం ఇక్కడే ఉందాం. చక్కాకేడిమో—పువ్వులూ—బొమ్మలూ — గౌనులూ— మంచి అక్కయ్య—అన్నీ ఉన్నాయి ఇక్కడ బాగుంది బావా!—మరిక్కణ్ణుంచి వెళిపోం; దూ?" అనడిగింది ఉష.

ఉషకు సమాధానం ఇచ్చే పరిస్థితిలో అప్పుడు లేడు శ్రీనివాసం!—చిన్న మగతక్రమ్మింది. ఎక్కడికో గాలిలోకి తేలిపోతున్నట్లు ఫీలయేడు! అంతట్లో డాక్టరితో పాటు రాధ వచ్చింది.

డాక్టరు శ్రీనివాసం శరీరాన్ని పరీక్ష చేసేడు. "హృదయం కొంచెం పాడయింది!—పైగా శరీరంలో ఉష్ణప్రకోపం జాస్తీగా ఉంది. కొంచెం కఫం కూడా చేరింది. దరిదాపు ఓ ఇరవై ఇంజెక్షన్లు తీసుకోవాలి. జబ్బుపోయిన తరువాతకూడా కొన్నాళ్ళు మందు తీసుకోవలిసుంటుంది!—బిల్లు రెండువందల రూపాయలవరకూ ఉంటుంది." అన్నాడు డాక్టరు.

"ఎంతయినా ఇచ్చుకుంటాను!—ఫరవాలేదు కదా?" అనడిగిందామె బెంగతో.

"భయంలేదు!" అనంటూ ఇంజెక్షన్ బాక్సు తెరిచేడు. ఓ ఇంజెక్షన్ చేసేడు. "బాగా నిద్దర పట్టేస్తుంది. లేపడానికి ప్రయత్నించకండి. రేపు ఉదయాన్నే నేనొచ్చి చూస్తాను." అని చెప్పి వెళిపోయేడు డాక్టరు.

## 5

శ్రీనివాసానికి జ్వరం కొంచెం తగ్గిందవాళ. హృదయంలో భారంకూడా తగ్గింది.—అవాళన్నాడు రాధతో నారింజపండు తింటూ—"ఇంతలా నా సేవ చేస్తున్న నీ రుణం ఎలా తీర్చుకోగలనో?!" అని.

"నన్ను మీరు వివాహం చేసుకుంటే రుణం తీర్చుకో గలిగినవారవుతారు!" అనంది రాధ.

"రాధా!—స్త్రీజాతిమీద నాకో నమ్మకం ఉండే దింతవరకూ?!—సాధారణంగా సవతులకి సంబంధించినవాళ్ళమీద స్త్రీ జాతికి ఈర్ష్య అసూయ లుంటాయని నమ్మేను. కానీ నువ్వు నా నమ్మకాన్ని కొంతవరకూ మార్చేసేవు. లోకంలో అంవిరాడవాళ్లూ నే నూహించినట్టుండరని తెలుసుకున్నాను!—ఇప్పుడు నిన్ను అర్థం చేసుకున్నాను. మావాళ్ళని వ్యతిరేకిస్తాను!—తప్పక నిన్ను వివాహం చేసుకుంటాను!" అనన్నాడు శ్రీనివాసం.

సంతోషాన్ని పట్టలేకపోయింది రాధ!—ఒక్క గంతేసింది!—"మీ వాళ్ళకి ఉత్తరం రాస్తాను. కాగు వైరు చేస్తాను!—ఇంకేముంది జబ్బు తగ్గిపోయినట్టే!" అంది.

"వొద్దు!—మావాళ్లకి మాత్రం తెలియచెయ్యొద్దు!—వాళ్లొస్తే ఈ పెళ్లి సవ్యంగా జరగదు!" అన్నాడు శ్రీనివాసం.

"మరేం ఫరవాలేదు. వాళ్లకి నే నచ్చచెబుతాను!" అంది రాధ.

"సరే నీఇష్టం!" అన్నాడు శ్రీనివాసం.

ఆరోజే వాళ్ళకి వైరు చేసింది రాధ. "శ్రీనివాసానికి జబ్బుగా ఉన్నట్లు"

## 6

అవాళ శ్రీనివాసానికి ఎంచేతో మళ్ళీ జబ్బు హెచ్చయిపోయింది. కఫం గొంతుకకి అడ్డు పడుతున్నది. శరీరంమీద అంతగా తెలివిలేదు!—రాధా, ఉష ఆప్రక్కనే కూర్చునున్నారు ఆందోళనతో. రాధ కళ్ళంట నీరు కారుతూంది!—"బావ మాట్లాడడేం?" అని బెంగతో ఉష అడిగింది రాధని!—

ఉషని గుండెల కద్దుకొని బాగా కన్నీరు కార్చింది రాధ.

—డాక్టరొచ్చి ఇంజెక్షన్ చేసేడు. "ఫరవా లేదు. తెలివి వచ్చేస్తుం దోగంటలో!" అని చెప్పి వెళిపోయేడు.

శ్రీనివాసానికి తెలివి రావడం, అతని తల్లి దండ్రులు లోనికి ప్రవేశించడం ఒక్కమారే జరిగింది!—

"అమ్మో!—నీవాళ్లం ఇంతమందిమీ ఉంటూ ఉండగా ఆఖరి కిలా దిక్కూ మొక్కూ లేకుండా జబ్బుతో బాధపడుతున్నావా బాబూ!" అని ఏడుస్తూ కొడుకుముఖంలోకి చూస్తూ, చేతులతో నిమురుతూ మంచందగ్గర కూలబడిం దాతల్లి.

మంచంమీద జబ్బుతో పడుక్కొనిఉన్న కొడుకువేపూ, రాధ వేపూ, ఉష వేపూ చూస్తూ ఆందోళనతో నిలబడ్డా డతని తండ్రి.

"డాక్టరూ!..." అని శ్రీనివాసంతండ్రి అంటూఉండగా నే...

—"ఇప్పుడే ఇంజెక్షనిచ్చి వెళ్ళేరు!" అనంది రాధ.

"నువ్వెరవమ్మా?!" అనడిగింది శ్రీనివాసంతల్లి.

ఇంకా రాధ సమాధానంఇవ్వకముందే—"అదో దేవ...త!" అనన్నాడు శ్రీనివాసం.

"అంటే?" ఆనడిగే డతనితండ్రి.

"మురికికూపంలోకి నే పడిపోతూఉంటే, తీసి రక్షించిం దీమె!— నే వివాహం చేసుకోబోయేది ఈమె... నే!..." అనన్నాడు శ్రీనివాసం ఆయాసంతో.

వాళ్లు చాలా ఆశ్చర్యపోయేరు!—"ఎన్నాళ్లకీ మాట అన్నావురా నాయినా! ఈ జబ్బు తగ్గిపోయిన వెంటనే వివాహం!" అం దాతని తల్లి.

అతని తండ్రి మాత్రం ఏమీ అనలేదు!—అతనికి అనుమానం లోలోన ఉంది!—ఆమె ఏ కులమో ఏమిటో అని!...కానీ అప్పట్లో అడగడం మంచిపని కాదని ఊరుకున్నాడు.

అంతట్లో రాధ తల్లి అక్కడికి తడుపుకుంటూ వచ్చింది. "ఏదో దానదృష్టం బాగుంది. మళ్ళీ పెళ్లవుతున్నాది దానికి!—లోకంలో కొందరికయినా విశాల మన స్తత్వం ఉంటుంది!" అందా ముసిలిది.

"ఏమిటిరా బాబూ...మళ్ళీ పెళ్ళంటున్నా దావిడ!" అనడిగిం దతని తల్లి. శ్రీనివాసం వేపు ప్రశ్నార్థకంగా చూసే డతని తండ్రి!—

ఆమధ్యనుంచి "బావా!" అని అరుస్తూ శ్రీనివాసం మంచంమీద కెక్కింది ఉష. "మాట్లాడవేం బావా?" అంది ఏడుస్తూ ఉష.

అంతా ఉషవేపూ శ్రీనివాసంవేపూ చూసేరు!

అక్కడి వాతావరణం అంతా అదోలా తయారయింది!—

